ప్రజాశక్తి
బుధవారం 19 ఏప్రిల్ 2023
5
అల్లూరి సీతారామరాజు



ఆశ్రమ విద్యార్థినికి కరోనా

ప్రజాశక్తి- జి మాడుగుల : మండలంలోని కె.కోడాపల్లి బంధవీధి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఒక విద్యార్థినికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మంగళవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేయగా, ఒక విద్యార్థినికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వెంటనే పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తగు వైద్యం కోసం తరలించినట్లు డాక్టర్ రవిచంద్రశేఖర్ తెలిపారు.

ఈ సందర్భంగా మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు తెలిపారు. ప్రతిఒక్కరూ విధిగా మాస్క్‌ధారణ, భౌతికదూరం పాటించడం, శానిటైజేషన్‌తోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని, వేడి ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ, నడిగట్ల ప్రకాష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యకు పరిష్కారం



నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -జిమాడుగుల : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత గిరిజన రైతుల సమస్యలను ఐటిడిఎ పిఒ, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ అక్కడికక్కడే పరిష్కరించారు. మంగళవారం జి. మాడుగుల మండలం వంజరి, పెద్ద కిల్లాడ గ్రామాల్లో పర్యటించి, జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించారు. చింతపల్లి మండలంలో భీమనపల్లి లంబసింగి గ్రామాల వద్ద ఎన్‌హెచ్ 516 రహదారి నిర్మాణానికి భూసేకరణకు తలెత్తిన సమస్యలను కూడా అక్కడికక్కడే కోర్టు నిర్వహించి పరిష్కరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

అడుగడుగునా నిరసన సెగలు

- గడపగడపకూ వెళ్లలేని గిరిజన ప్రజాప్రతినిధులు
- పోలీసు భద్రత లేకుండా కాలు బయటకు పెట్టలేని స్థితి
- ప్రభుత్వం, ప్రజల మధ్య నలిగిపోతోన్న ఎంపి, ఎమ్మెల్యేలు



కొత్తూరుపాడులో ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బోయ/వాల్మీకులు, బెంత ఒరియాలు, ఇతర అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన అసెంబ్లీ తీర్మానం మన్యంలోని గిరిజన ఎంపి, ఎమ్మెల్యేలకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. నియోజకవర్గాల్లో ఎక్కడికి పోయినా నిరసన సెగలు తగులుతోంది. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని ఆందోళనకు దిగుతున్నారు. దీంతో సొంత నియోజకవర్గాల్లో ప్రశాంతంగా తిరగలేని పరిస్థితి నెలకొంది. నిన్న మొన్నటివరకు ప్రభుత్వం కల్పించిన గన్‌మెన్లతోనే యథేచ్ఛగా తిరిగిన అధికార పార్టీ ఎంపి, ఎమ్మెల్యేలు ఇప్పుడు అదనపు పోలీసు బందోబస్తు లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. పోలీసు భద్రతతోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల్లో వెళ్లినా, నిరసన సెగ తప్పడం లేదు. గిరిజనుల హక్కులు, చట్టాలు, ప్రయోజనాలపై ఇన్నాళ్లు నిర్లక్ష్యం ప్రదర్శించినా, సర్దిచెప్పుకునే పరిస్థితి ఉన్నా ఇప్పుడు నాలుగేళ్ల గడిచిన తర్వాత కూడా అదే ధోరణిలో మాట్లాడితే మన్యవాసులు నమ్మే పరిస్థితి లేకపోవడంతో నిలదీస్తూ, నిరసనలు వ్యక్తం చేస్తూ అ డుగడుగునా అడ్డుకునే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 1/70, జిఒ3 రద్దు, బోయ/వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్ అంశాలు ఇపుడు గిరిజన ప్రజాప్రతినిధులకు గుదిబండగా మారాయి. ప్రజల్లోకి వెళ్లకుంటే పైనుంచి పార్టీ అధిష్టానం పనితీరు బాగోలేదంటూ మొట్టికాయలు వేస్తుంటే, ఇక్కడ ప్రజల్లోకి వెళితే, అడుగు ముందుకు వేయలేని పరిస్థితుల్లో నిలదీతలు, నిరసన సెగలు మిన్నంటుతున్నాయి. ప్రజల్లోకి వెళ్లేందుకు గట్టిపోలీసు బందోబస్తు సరిపోతున్నా, మండిపోతోన్న ప్రజలతో మాట్లాడేందుకు మాత్రం వీలు చిక్కని పరిస్థితుల్లో మల్లగుల్లాలతో అల్లాడిపోతున్నారు.



ఐటిడిఎ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, నిర్వాసితులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై
ఐటిడిఎ ఎదుట బైఠాయింపు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితులు చింతూరు ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ చింతూరులో ఆపేసిన పోలవరం సర్వేను తక్షణమే ప్రారంభించాలన్నారు. గిరిజనేతరులకు కూడా ప్రభుత్వమే భూమి ఇచ్చి, ఇల్లు కట్టి ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యతగా ఇల్లు నిర్మించాలని, తాడ్వాయిలో మాత్రమే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా ఇల్లు నిర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు. 2022లో వచ్చిన వరదల్లో పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా చింతూరు మొత్తం మునిగిపోయిందని, దానికోసం 41.15 కాంటూరులో చింతూరు గ్రామాన్ని క్లారిటీగా చేర్చాలని తెలిపారు. ఆ విధంగా ఇటీవల కుటుంబాలు సర్వే నిర్వహించాలని గ్రామసభలు కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. కాని సర్వేను ఆపివేసి మరోపక్క మొదటి ఆప్షన్ అనగా ప్రభుత్వం నిర్మించి ఇచ్చే ఇంటిని అధికారులు మీటింగ్లో వెల్లడి చేసి వాలంటీర్లకు చెప్పడం జరిగిందన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, విఆర్ పురం మండలాల్లోని గిరిజనేతరులకు తాడువాయిలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లను కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇక్కడ కూడా మొదట మూడవ ఆప్షన్ ఇవ్వటం జరిగిందని, మళ్లీ ఎటువంటి జీవో లేని ఈ ప్రతిపాదనను ప్రచారాన్ని అధికారులు ముందుకు తేవటం దుర్మార్గమన్నారు. నిర్వాసితుల మధ్య చిలిక తేవద్దని, వారిని గందరగోళంలోకి అధికారులు నెట్టవద్దని హితవుపలికారు.



పిఒకు విన్నవిస్తున్న దృశ్యం

అనంతరం ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో సూరజ్ గనూరే ఆందోళన వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ గిరిజనేతరులకు కేవలం చింతూరు మండలానికి ప్రయారిటీ పేరుతో ఒకటో ఆప్షన్ తొలగించి రెండు మూడు ఆప్షన్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. నిర్వాసితులంతా ముంపు బాధితులైనని ఇక్కడ కులమత భేదాలు తావులేదని మునిగే వారందరూ ఒకే కోవలోకి వస్తారని వారందరికీ ఒకే న్యాయం జరగాలని కోరారు. 2022లో వచ్చిన వరదలకు వందల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని, ఇంకా కోలుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ విషయంపై పిఓ సమాధానమిస్తూ 17 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చడం జరిగిందని ఇది ప్రయారిటీ పేరుతో ప్రభుత్వం నిర్వాసితులకు అవకాశం కల్పించిందని చెప్పారు. నిర్వాసితుల అభ్యర్థన మేరకు ఈ విషయంపై ప్రభుత్వానికి తమ డిమాండ్లను పంపడం జరుగుతుందన్నారు. గిరిజనులకు మాదిరిగానే గిరిజనేతర పేదలకు కూడా ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇచ్చే ఆప్షన్ను కొనసాగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం నిర్వాసితులు దరఖాస్తులను పిఓకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఎస్సీ. బీసీ కాలనీ, సంతపాకల నిర్వాసితుల ప్రజలు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అనుతోష్ శ్రీవాస్తవ



రెవెన్యూ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న అనుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : రెవెన్యూ, పోలీసులు, ఇతర అధికారులు, ప్రజల సహకారంతో పక్కా ప్రణాళికతో ఇసుక మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేద్దామని పెదబయలు డిప్యూటీ తహశీల్దార్‌గా రెండు వారాలపాటు తాత్కాలిక బాధ్యతలు నిర్వర్తించనున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అనుతోష్ శ్రీవాస్తవ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు మంగళవారం పెదబయలు తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న డిటి పోస్టులో బాధ్యతల్లో చేరారు. మంగళవారం నుంచి నెలాఖరు వరకు బాధ్యతల్లో ఉంటానని వెల్లడించారు. ఈసందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు పది బృందాలను నియమించి, రహదారుల వద్ద చెక్‌పోస్టులను నియమించి, పోలీసు భద్రతతో పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అన్నిశాఖల అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కరరావు, విఆర్ఒ సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తాపంతో విలవిల

మండుటెండలకు అల్లాడిపోతున్న మన్యవాసులు
ఎండవేడిమికి ఇంటా, బయటా ఉండలేక అవస్థలు
చెట్ల నీడన సేదదీరుతోన్న గిరిజనం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఏజెన్సీలో వాతావరణంలో అనూహ్య మార్పులతో మండుతున్న ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 9 దాటితే ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టడానికి ప్రజలు హడలిపోతున్నారు. నిప్పుల కొలమీ వద్ద ఉన్నట్లుగా ఉందని ఆందోళనకు గురవుతున్నారు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో బెంబేలెత్తుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. చిన్నారులు, వృద్ధులు, బాలింతలు అవస్థలు వర్ణనాతీతం. ఫ్యాన్లు, కూలర్ల నుంచి వెలువడే గాలి సైతం వేడిగా ఉండడంతో ఉపశమనం పొందేందుకు ప్రత్యామ్నాయం మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దష్ట్యా నీరు ఎక్కువగా తాగాలని, ద్రవపదార్థాలు తరచుగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెదబయలు రూరల్ : పెదబయలు మండల కేంద్రంలో 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటిన ఉష్ణోగ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడికి ఇంటా, బయటా ఎక్కడా ఉండలేని పరిస్థితుల్లో చెట్లనీడకు, కాస్త చల్లదనం ఉన్న ప్రాంతాలకు వెళుతున్నారు.



చిత్రాయిపుట్టులో చెట్టు నీడన సేదదీరుతున్న గిరిజనులు

సీతగుంట పంచాయతీ, చిత్రాయిపుట్టు గ్రామానికి చెందిన గిరిజనులు మర్రిచెట్టు కింద రచ్చబండ దరికి చేరి సేదదీరడం కనిపించింది. పెదబయలు నడి బజారు అంబేద్కర్ సెంటర్‌లో వ్యాపారులు గొడుగునీడన అవస్థలు పడుతూ కూరగాయాల అమ్మకాలు చేపట్టారు. ఆరుబయటకు వచ్చిన ప్రయా ణికులు, గొడుగుల నీడన, ఇతరత్రా ఉపశమన మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఎండ దెబ్బకు తడారిపోతున్న గొంతును తడిపేందుకు పలువురు గిరిజనులు జీలుగుకళ్లను ఆశ్రయించడంతో ఆ దుకాణాలకు గిరాకీ ఏర్పడింది. మొత్తానికి మండుటెండల దెబ్బకు మన్యవాసులు అల్లాడిపోతున్నారు.



పాడేరులో మండుటెండలకు గొడుగు నీడన విద్యార్థులు



పెదబయలులో గొడుగు నీడన కూరగాయల దుకాణాలు

సినీ నటుడు అల్లు రమేష్ మృతికి సంతాపం



అల్లు రమేష్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి పాడేరు: విశాఖపట్నం జిల్లాకు చెందిన సినీ నటుడు అల్లు రమేష్ సోమవారం రాత్రి విశాఖలో గుండెపోటుతో ఆకస్మిక మరణంపై పట్టణంలోని పలువురు విచారం వ్యక్తం చేశారు. పాడేరులోనే బాల్య జీవితమంతా గడిపిన అల్లు రమేష్ పాడేరు ప్రభుత్వ హైస్కూల్‌లోను, ఆ తర్వాత మాడుగుల హైస్కూల్లోనూ విద్యాభ్యాసం చేశారు. పాఠశాల స్థాయిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో నాటికలు తదితర ప్రదర్శనలు ఇచ్చి కళారంగం పట్ల మక్కువ పెంచుకున్నారు. టీవీ, వెబ్ సిరియల్స్ లో నటిస్తూ సహనటుడిగా సుమారు 90 సినిమాల్లో నటించారు. చిరుజల్లు సినిమాలో హీరో తరుణ్ మిత్రబృందంలో ఒకడిగా తన మొదటి సినిమాలో నటించారు. ఆ తర్వాత పలుచోట్ల అనేక స్టేజ్ షోలు టీవీ సీరియల్స్ సినిమాల్లో నటిస్తూ కళారంగానికి అంకితమయ్యారు. రమేష్ మతి పట్ల మిత్రులు సన్నిహితులు అనేకమంది సంతాపం వ్యక్తం చేశారు. పాడేరు మాడుగులలో కొన్నేళ్లపాటు నివసించిన రమేష్ కు ఈ ప్రాంతంలో అనేకమంది మిత్రులు ఉన్నారు. పాడేరుకు చెందిన పలువురు పాత్రికేయులు. సహచర కళాకారులు రమేష్ అంత్యక్రియలకు హాజరై ఆయన భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలిపారు.

అన్నింటా గిరిజన నిరుద్యోగులకు నష్టమే..!

ప్రజాశక్తి-పెదబయలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో గిరిజన నిరుద్యోగులు అన్నింటా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. గిరిజన ప్రాంతంలో వందశాతం ఉద్యోగావకాశాలు స్థానిక గిరిజనులకు వర్తింపజేసే జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే, చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం దానిపై కనీసం రివ్యూ పిటిషన్ కూడా దాఖలు చేయలేదు. దీంతో ఉద్యోగావకాశాల్లో మన్యవాసులు నష్టపోయే పరిస్థితి ఉంది. పాతికేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న 1998 డిఎస్‌సి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వడం హర్షనీయమైనా, అది పొట్టకొట్టిందని పెదబయలు నిరుద్యోగ గిరిజన అభ్యర్థులు వాపోతున్నారు. 1998 డిఎస్‌సి అభ్యర్థులు 25మందిని పెదబయలు మండలంలో నియమించగా, 25పాఠశాలల్లోని పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. అయితే ఆయా పోస్టులు గిరిజనేతరులకు దక్కడం తమకు ఉద్యోగవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ఏర్పాటు చేసినా, పోస్టులు ఖాళీ లేని పరిస్థితి ఉందని అంటున్నారు.ఇలా ఏజెన్సీలోని గిరిజన హక్కులు, చట్టాలు హరించుకుపోతూ, మన్యవాసులకు మొండిచేయి చూపే ప్రభుత్వ విధానాలపై గిరిజన యువత ఆవేదన చెందుతూ, ఆందోళనకు సన్నద్ధమౌతున్నారు.

కలెక్టర్ చొరవతో గ్రావెల్ రోడ్డు పనులు



ప్రొక్లెయినర్‌తో గ్రావెల్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని రూడకోట పంచాయతీ రొండలంపుట్టు గ్రామానికి గ్రావెల్ రోడ్డు పనులు చేపడుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేక ఆ గ్రామస్తులు పడుతున్న కష్టాలను స్థానిక సర్పంచ్ కె సురేష్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టర్ స్పందించి, రెండు కిలోమీటర్ల గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడం, ప్రొక్లెయినర్‌తో చకాచకా పనులు జరుగుతుండడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ, జిల్లా కలెక్టక్‌కు రొండలంపుట్టు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు

సామాన్యుని నడ్డి విరుస్తున్న మోడీ ప్రభుత్వం

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు



కుంజావారి గూడెంలో...

ప్రజాశక్తి -ఎటపాక

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు అన్ని రకాల నిత్యావసరాల ధరలను భారీగా పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తుందని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు మండలంలోని కన్నాపురం గ్రామంలో మంగళవారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి వర్గ సభ్యులు డేగల మాధవరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధులు సగానికి సగం కోత పెట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆకిశెట్టి రాము, నక్కా సూరిబాబు, సిపిఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, వరదా బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విఆర్ పురం : సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆధ్వర్యంలో మండలంలోని కుంజవారిగూడెం నుండి బోరుగుంపు వరకు నాలుగో రోజు ప్రచార భేరి నిర్వహించారు. ప్రతి ఇంటికి కరపత్రం పంచుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ప్రచార భేరి సాగింది. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ మండలంలోని పెద్దమటపల్లి నుండి కుందులూరు వరకు 15 కిలోమీటర్లు రహదారులు శిథిలమయ్యాయని, రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే ధనలక్ష్మి శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ సమయంలో రహదారులను తవ్వి వదిలేశారని, నేటికి రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. దీంతో ప్రజలు ఆసుపత్రికి, కార్యాలయాలకు, బ్యాంకులకు వెళ్లడానికి, నిత్యవసర సరుకులకు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పోడు వ్యవసాయం చేయకుండా చట్టాలను సవరణ చేస్తూ ఆదివాసీలను అడవుల నుండి తరిమే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు తక్షణమే పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, కుంజ నాగిరెడ్డి, సర్పంచ్ సవలం మారయ్య, రాజయ్య, పెద్దయ్య పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ఉమ్మడివరం గ్రామాల్లో మంగళవారం ప్రచార భేరి సాగింది. ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా కూలీలకు మజ్జిగ, మంచినీళ్లు, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలన్నారు. రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు, హజరత్, చిక్కాల రామారావు పాల్గొన్నారు

కూనవరం : పేద బడుగు వర్గాల ప్రజలు ఆధార పడే ఉపాధి హామీ చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి కూలీలకు సరైన వేతనం ఇవ్వటం లేదని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య విమర్శించారు. మంగవారం నిర్వహించిన ప్రచార భేరిలో వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల వ్యవసాయ భూముల్లో పంటలు పండక పేద రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే పోలవరం ప్రాజెక్టు ముంపు భూములకు సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సర్పంచ్ బి.రామారావు బి.సుబ్బయ్య గుండం బాబూరావు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలను కలిసిన సిపిఎం నాయకులు

బిజెపిని గద్దె దించడమే లక్ష్యం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్

ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే సిపిఎం, సిపిఐ ప్రచారభేరి లక్ష్యమని పలువురు నేతలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 న అరకులోయలో నిర్వహించే బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం మండలంలోని పెదలబుడు, చినలబుడు, మాడగడ పంచాయతీ గ్రామాల్లో సిపిఎం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి కె రామారావు, నాయకులు పి.బాలదేవ్ మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొట్టి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్‌ఐసి, రోడ్డురవాణా, ఓడరేవులు, స్టీల్‌ప్లాంట్, బ్యాంకింగ్ రంగాలను ఆదానీ అంబానీలకు కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని, నూతన అటవీ చట్టం పేరుతో అడవులను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. చింతపల్లి, అనంతగిరి మండలాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టులను ఆపాలని కోరాఉ. ప్రచార కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె మగ్గన్న, టి.హరి, కె మొద్దు, రత్నకుమారి, సీత, పెదలబుడు పంచాయతీ వార్డు మెంబర్ అప్పలమ్మ, చంప, లైచన్ పాల్గొన్నారు.

20న సమగిరిలో హైడ్రోపై బహిరంగ సభ

పాడేరు : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగావామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం చింతపల్లి మండలం చిత్రాలగుప్పు వద్దకు చేరుకుంది. యాత్రలో సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు పాంగి ధనుంజయ్, మాట్లాడుతూ ఈ పాదయాత్ర గొందిపాకలు మీదుగా సమగిరి, ఎర్రవరం చేరుకుని ఈ నెల 20న సమగిరిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సమస్యపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాడేరు జిల్లా కేంద్రం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. పాదయాత్రలో వామపక్ష నాయకులు పెట్ల పోతురాజు అమర్ పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం ఉమ్మడివరంలో...



కూనవరంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య



నినాదాలు చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు


అరకు కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న వర్షానికి లైట్లు వేసుకుని వస్తున్న కారు

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఒకవైపు ఎండలు మండుతూనే, మరోవైపు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండువేసవిలా ఎండలు మండిపోగా, తర్వాత ఒకసారిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల సేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిసి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షానికి పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

నేటి నుంచి ప్రచారభేరి పాదయాత్ర

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్య పరచడానికి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి మండలంలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీసభ్యులు టి.సూర్యనారాయణ చెప్పారు. వారు సంతలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి, ప్రచారభేరి నిర్వహించడం ద్వారా గిరిజనాన్ని సమాయత్తం చేస్తామన్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

నాడు - నేడు పనుల జాప్యంపై అసంతృప్తి

ప్రజాశక్తి- డుంబ్రిగూడ : మండలంలోని కురిడి యుపి పాఠశాలను ఎంఇఒ ఎస్. రామచంద్రరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యపై ఆరా తీశారు. వర్క్ బుక్స్ పరిశీలించి విద్యార్థులచే చదివించారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా వర్క్‌బుక్స్ పరిశీలించి తప్పుఒప్పులను సరి చేయాలని ఆదేశించారు. నాడు నేడు పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు నేడు పనుల్లో జాప్యం చేస్తే తీవ్ర చర్యలు తీసుకోక తప్పదని ఎంఇఒ రామచంద్రరావు హెచ్చరించారు.

రోడ్ల విస్తరణకు వ్యతిరేకం కాదు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : దుకాణాలు, వ్యాపార సముదాయాలు, జనావాసాలకు వాటిల్లుతున్న నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నర్సీపట్నంలో రోడ్ల విస్తరణ వెడల్పును వంద అడుగుల నుంచి 80 అడుగులకు తగ్గించాలని కోరుతున్నామే తప్ప, తాము రోడ్ల విస్తరణకు వ్యతిరేకం కాదని స్థానిక వ్యాపారులు స్పష్టం చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, వ్యాపారస్తులు షాప్ యాజమానులు నిర్వహించిన సమావేశంలో మంగళవారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల విస్తరణ వల్ల భవనాలను, దుకాణాలను కోల్పోతున్న వారి దుస్థితిని గమనించి తగు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అంతేకాకుండా నోటీసులు అందుకున్న 15 రోజుల్లో దుకాణాలు ఖాళీ చేయమంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు గతనెలలోనే ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. రోడ్ల విస్తరణను 80 అడుగులకు చేయాలని, పరిహారం కింద టిడిఆర్ బాండ్లకు బదులు నగదు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నెలరోజులుగాతున్నా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో దాని కోసం ఎదురుచూస్తున్నామన్నారు. తామంతా విస్తరణకు వ్యతిరేకం కాదని అది జరిగే తీరును మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పూర్తిగా బిల్డింగ్ నష్టపోతున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

టిడిపి నేత శంకర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి హుకుంపేట:అరకు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి, సీనియర్ నేత శంకరనాయుడు తల్లి చిన్నాలమ్మ తమ స్వగ్రామంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర ఆదేశాల మేరకు కరకపుట్టు గ్రామంలో చిన్నాలమ్మ పార్థివ దేహానికి పలువురు టిడిపి నేతలు నివాళులర్పించారు. రమేష్ కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో తెడేపా నాయకులు బొడ్డ శ్యామ్ సుందర్, అర్జున్, అరకు అసెంబ్లీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్ర సంతోష్‌కుమార్, అరకు అసెంబ్లీ కార్యదర్శి చప్పలి శంకరరావు, అరకు అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పేట్రేలి బాలు దొర, ముళియపుట్ ఉప సర్పంచ్ మత్స్యరాజు, కోటి బాబు, నాగేశ్వరరావు, శేఖర్, మత్స్య రాజు పాల్గొని నివాళులర్పించారు.


చిన్నాలమ్మ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు

ప్రజాశక్తి - రావికమతం : వికలాంగ విద్యార్థుల అభ్యున్నతికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలో మేడివాడ జెడ్‌పి హైస్కూల్‌లో విభిన్న ప్రతిభావంతుల సహిత విద్యా కార్యక్రమంలో 51మంది విద్యార్థులకు రూ.ఐదు లక్షల విలువైన వికలాంగ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎనిమిది మందికి వీలుచైర్లు,రెండు ట్రైసైకిళ్లు, రెండు సిపి చైర్లు, ఎనిమిది వినికిడి యంత్రాలు, 31మంది బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు ఎంఆర్ కిట్లను అందజేశారు.. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ వికలాంగ బాలలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారిణి శకుంతల మాట్లాడుతూ సమగ్ర శిక్ష నుంచి వికలాంగ విద్యార్థులకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోంబేస్డ్ అలవెన్స్, గర్ల్స్ స్టైఫండ్ కూడా అందించామన్నారు. వికలాంగులకు ఉపకరణాలు రావడంతో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడుల కృషిని అభినందించారు. విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ కూడా వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పైలా రాజు, జెడ్‌పిటిసి రమణమ్మ ఆదిమూర్తి, సర్పంచ్ శివ, పాఠశాల చైర్మన్ శేషు, ఎంపిటిసి జి సత్యప్రసాద్, ఎంఇఒ జయలక్ష్మి, హెచ్ఎం ఎం.జయలక్ష్మి, కవగుంట సర్పంచ్ వరహాలు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో ఈనెల 18 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు, 18 ,19,20 తేదీల్లో పీకే.పల్లి, 18 19 తేదీల్లో లింగాపురం, 20న తంగేడు, 25, 26 తేదీల్లో బికేపల్లి, బోడపాలెం గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసి కొత్తగా నమోదుతోపాటు ఆధార్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

గొలుగొండ : మండలంలో పలు సచివాయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు అన్నారు. ఈ నెల 18, 19, 20, 26, 27 తేదీల్లో మండలంలో గొలుగొండ, గుండుపాల, కేడిపేట, పుత్తడిగైరంపేట సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఈ గ్రామస్థులే కాకుండా మిగిలిన సచివాలయాల్లో ఉన్న వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలో గంజాయి, నాటుసారా అక్రమ రవాణాలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను ఈ నెల 20న గురువారం అరకులోయ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు అరకులోయ ఎస్ఇబి సిఐ ఎ.గణపతిబాబు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలలో మూడు ఆటోలు, ఒక మోటారు సైకిల్, మొత్తం నాలుగు వాహనాలను వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వ్యక్తులు ఫోన్ నంబర్లు 9440902393, 8500455420, 6281322458 లకు సంప్రదించాలని కోరారు.

త్వరితగతిన ఎస్‌టిజి సర్వే పూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎస్‌టిజి సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ సీతారామరాజు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ,అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌టిజి సర్వేలో భాగంగా గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలు, 6-19 వయస్సుగల పిల్లలు వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసి శుక్రవారం నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి శతశాతం సేవలను అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఓటరు కార్డ్‌లకు శతశాతం ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, సిడిపిఒ శ్రీవిద్య పాల్గొన్నారు .

రేషన్ పంపిణీపై ఆరా

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవ డిపో నెంబర్ 24 పరిధిలో జెడ్.జోగింపేట, రొచ్చుపనుకు, బంగారుబంద, తాటిపర్తి గ్రామాల్లో రేషన్ పంపిణీపై తహశీల్దార్ మహేశ్వరరావు, సివిల్ సప్లై అధికారి కేతా ఈశ్వరరావు, ఆర్ఐ చినబ్బాయి ఆరా తీశారు. రెండు నెలలుగా రేషన్‌డిపో ద్వారా బియ్యం అందటం లేదని పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు స్పందించి, విచారించారు. లబ్ధిదారుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, నివేదికను జెసికి అందజేస్తామని, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

502వ రోజుకు మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి : న్యాయం జరిగే వరకు హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార జెఎసి నేతలు స్పష్టం చేశారు.పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారు శాంతియుత మహా ధర్నా 502వ రోజుకు చేరిన సందర్భంగా .మంగళవారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, చేపల సోమేష్, బాబూజీ, నూకరాజు, పిక్కి కోదండరావు, కాశీ, రాజు, కోటి, , జాను, కాశీ రావు, వీర్రాజు, అప్పలరాజు, కాశీ ఆదిరాజు, తాతబాబు, నల్ల పాల్గొన్నారు .

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి -మాడుగుల : మండల కేంద్రంలో జరుగుతున్న వివిధ రహదారులు, కాలువల నిర్మాణాలపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పరిశీలించి సమీక్ష జరిపారు. మాడుగుల టీచర్స్ కాలనీ, అర్బన్ కాలనీల్లో రూ. కోటి 30 లక్షలతో చేపడుతున్న 21 రహదారులు, కాలువలు నిర్మాణాలు పరిశీలించారు మోదమాంబ కాలనీలో శిథిలావస్థకు చేరిన వసతిగృహం పరిశీలించారు ఇక్కడ మార్కెట్ యార్డ్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపుతామని మంత్రి వెల్లడించారు. అలాగే అర్బన్ కాలనీలో పాత వసతి గహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలు మేరకు నియోజకవర్గంలో పాటు రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైసిఇప నాయకులు ఎడ్ల హేమంత్, వరహాలు, అచ్యుతం, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు

భూసార పరీక్షలతో ప్రయోజనం

ప్రజాశక్తి-మాడుగుల : మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలతో పంటలను సాగుచేయడం, యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల మంచి ప్రయోజనముంటుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో మట్టి నమూనా సేకరణ, పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయడం ద్వారా భూమిలో ఉన్న లోపాలు తెలుస్తాయని తద్వారా దానికి అనుగుణంగా ఎరువులు, సాగుయాజమాన్యం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.


ప్రముఖ చిత్రకారుడు బాలి (ఫైల్ ఫొటో)

బాలి మృతితో విషాదఛాయలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రముఖ రేఖ, వ్యంగ్య చిత్రకారుడు బాలి (78) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారన్న వార్తతో విశాఖ నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ప్రస్థానాన్ని, బొమ్మలను పలువురు గుర్తు చేసుకున్నారు. కొంతకాలంగా అస్వస్థతగా ఉన్న బాలి నగరంలోని ఎంవిపి కాలనీ సెక్టార్ 9లో ఉన్న తన గృహంలో కన్నుమూశారు. ఆ సమయంలో అతని కుమార్తె వైశాలి అక్కడే ఉన్నారు. సాయంత్రం బాలి అంత్యక్రియలు ఎంవిపి కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. బాలి మరణించిన సంగతి తెలియడంతో అనేకమంది ప్రముఖులు ఎంవిపి కాలనీకి వెళ్లి బాలి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాలి జన్మస్థలం అనకాపల్లి. 1945 ఆగస్టు 16న జన్మించిన బాలి అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. తండ్రికి చిత్రకళపై ఉన్న ఆసక్తి బాలిలో చిన్నప్పటి నుంచి కలిగింది. చిత్రకళపై మక్కువ పెంచుకొని చదువుకుంటున్న రోజుల్లోనే పలు కార్టూన్లు గీసి, అప్పటి ఆంధ్రజ్యోతి వార పత్రిక, యువ, జ్యోతి మాస పత్రికలకు పంపడం, అవి ప్రచురణ కావడంతో చిత్రకళపై మరింత మక్కువ పెంచుకున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించి, ఇరిగేషన్ శాఖలో క్లర్క్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగిగా ఉంటూనే కార్టూన్లు గీస్తూ, పత్రికలకు పంపేవారు. 1974లో విశాఖలో ఈనాడు ప్రాంతీయ దినపత్రిక ప్రారంభమైంది. అప్పటి ఆ పత్రిక ఎడిటర్ ఎబికె.ప్రసాద్ అభ్యర్థన మేరకు ఈనాడులో స్టాఫ్ ఆర్టిస్టుగా, కార్టూనిస్టుగా చేరారు. ఏడాది కాలంలోనే ఈనాడు నుంచి బయటికి వచ్చారు. ప్రారంభంలో శంకరరావు పేరుతో కార్టూన్లు వేసిన బాలి ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి ఆంధ్రజ్యోతిలో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా చేరారు. అప్పటి సీనియర్ జర్నలిస్ట్ పురాణం సుబ్రహ్మణ్యం సూచన మేరకు శంకరరావు పేరుకు బదులు బాలి పేరుతో కార్టూన్ వేయడం ప్రారంభించారు. కార్టూన్ బొమ్మలు గీయటం గొప్ప కాదు, దానిలో ఫన్ పేల్చటంలోనే కష్టం ఉంటుందని బాలి చెబుతుండేవారు. కార్టూన్ చిత్రాలతో 8 పుస్తకాలు రాశారు. జోక్స్‌పై సంకలనమే ఇచ్చారు. కథా రచనలలో కూడా బాలికి ప్రవేశం ఉంది 35 వరకు కథలు రాశారు. బాలి భార్య ధనలక్ష్మి 2010లో మరణించారు. ఆయనకు ఒక కుమారుడు గోకుల్, వైశాలి ఉండేవారు. వీరిద్దరూ ఉన్నత చదువులు చదువుకొని అమెరికాలో స్థిరపడ్డారు. అయితే ఇటీవల గోకుల్ అమెరికాలోని ఒక ప్రమాదంలో మరణించాడు. ఎంవిపి కాలనీలో ఉంటున్న బాలికి ఆరోగ్యం బాగా లేని కారణంగా ఆయన కుమార్తె వైశాలి ఇక్కడే ఉంటూ తండ్రికి సేవలు చేస్తున్నారు. బాలికి ప్రముఖులతో, మంచి పరిచయాలు ఉన్నాయి. బాలి అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరు. బాలి మృతి ఎంతోమంది కళాకారులను కలిచివేసింది. ఆయన లేకపోతే ఏం ? ఆయన కార్టూన్లు మాత్రం పది కాలాలు చల్లగా ఉంటాయని పలువురు చెప్పుకొచ్చారు.

నగర అభివృద్ధికి కృషిచేద్దాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మంగళవారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సాయికాంత్ వర్మను జివిఎంసి కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సభ్యులతో మాట్లాడుతూ అందరం కలిసి నగర అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఆర్థిక పరిస్థితులను చూసుకొని బిల్లులను కూడా వెంట వెంటనే రిలీజ్ చేస్తామని చెప్పారు. అందుకు సభ్యులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు వీరారెడ్డి, కన్వీనర్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సాదురావు, ఉపాధ్యక్షులు రామనాయుడు, సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి నర్సింగరావు, సలహాదారులు షిరిడి శ్రీనివాసరావు సభ్యులు ఆర్ఎ.నాయుడు, రాజాన రాంబాబు, బిఎ.రాము, గజపతిరాజు, చైతన్య ప్రసాద్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు విస్తృత సేవలు

దేశంలోనే ఉత్తమ డిస్కంగా నిలిపేందుకు కృషి
ఇపిడిసిఎల్ నూతన సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి అన్నారు. మంగళవారం ఉదయం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సిఎమ్‌డిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఇపిడిసిఎల్‌కు ఉత్తమ డిస్కామ్‌గా గుర్తింపు లభించేలా పనిచేస్తానన్నారు. ఆర్‌డిఎస్ఎస్, జగనన్న హౌసింగ్ కాలనీ విద్యుద్ధీకరణ, వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా, అంతరాయం లేకుండా 24 గంటలూ అన్నిచోట్లా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. 33 కెవి, 11 కెవి ట్రిప్పింగ్‌లను తగ్గించేందుకు, వినియోగదారునికి సంస్థ సేవలు చేరువచేసే ప్రభుత్వ పథకాల అమలుకు పటిష్టమైన చర్యలు చేపడతానన్నారు. ఇందుకు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల సహకారం తీసుకుంటానన్నారు. మరమ్మతు, నిర్వహణ ఖర్చులు, సరఫరా నష్టాలు తగ్గించడం, సబ్ స్టేషన్ ఆటోమేషన్‌కు గ్లోబల్ సాంకేతికత వినియోగం పెంచడం, కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంపై దృష్టిసారిస్తానన్నారు. పధ్వీతేజ్‌కు ఇపిడిసిఎల్ నుంచి ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిగా బదిలీపై వెళ్తున్న కె.సంతోషరావుతో పాటు సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్, రాధికా అనుసూరి, పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న పృథ్వీతేజ్

నిప్పులు చెరిగిన భానుడు

మండుటెండతో విలవిల్లాడిన జనం
విశాఖలో 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు


మండుటెండలోనే కూరగాయల వ్యాపారాలు సాగిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భానుడి ప్రతాపంతో జనం విలవిలలాడుతున్నారు. మండుటెండలతో గడచిన కొద్దిరోజులుగా నానా అవస్థలు తప్పడం లేదు. ఇంట్లోంచి కాలు బయటకు మోపాలంటే వణికే పరిస్థితులు నెలకొన్నాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడమే ఇందుకు కారణంగా ఉంది. మంగళవారం విపరీతమైన వేడిమితో విశాఖ నగరంలో జనం అల్లాడిపోవడం కనిపించింది. పలు చోట్ల 44 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలే అత్యల్పంగా ఉన్నాయి. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరం వద్ద 43.86 డిగ్రీలు నమోదు కాగా అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 44.01 డిగ్రీలు, ఇదే జిల్లా కోటవురట్ల మండలం కైలాసపురంలో 44.44 డిగ్రీలు నమోదైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల 45 డిగ్రీలు అత్యధికంగా, 43 డిగ్రీలు అత్యల్పంగా నమోదయ్యాయి. విజయనగరం జిల్లా రాజాంలో 45 డిగ్రీలు, పూసపాటిరేగ మండలం అల్లాడపాలెంలో 44.03 డిగ్రీలు నమోదైంది. శ్రీకాకుళం జిల్లా బూర్జ వద్ద కొల్లువలసలో 44.8 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇదే రకమైన ఉష్ణోగ్రతలు కొనసాగాయి. భారత వాతావరణ సంస్థ (ఐఎండి) కూడా మంగళవారం హెచ్చరికలు జారీచేసింది. అందులో విశాఖ, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలు కూడా ఉన్నాయి. వేడిగాల్పులు ఉంటాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

వడగాల్పులతో భయాందోళన

ఉదయం 8 గంటల నుంచే భానుడి ప్రతాపం మంగళవారం కనిపించింది. రోడ్లపై జనం తిరిగాడే పరిస్థితి బాగా తగ్గుముఖం పట్టింది. వృద్ధులు, చిన్నపిల్లలు రహదారులపై కనిపించలేదు. వడగాలుల ప్రభావంతో ఇంటికే పరిమితమైపోయారు. దేశంలోని ఎడారి ప్రాంతం నుంచి గాలుల దిశ ఈ ఎండాకాలంలో భూమిపైకి వస్తున్నందున ఈ పరిస్థితి కొనసాగుతోందని, దక్షిణ గాలులు వచ్చే వరకూ వేడిమి తగ్గే అవకాశాలుండవని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో మూడు రోజుల వరకూ వేడి గాలుల ప్రభావం ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆదివాసీల భవిష్యత్తుకు ముప్పు

ప్రజాశక్తి - ఎటపాక

జగన్ ప్రభుత్వంలో ఆదివాసీలకు భవిష్యత్తు లేదని, జగన్ పాలన ఆదివాసీల పాలిట శాపంగా మారిందని మన్యం గిరిజన జేఏసీ కన్వీనర్ గొంది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రాంగోపాల్ పురంలో నక్కా సూరిబాబు అధ్యక్షతన మన్యం గిరిజన జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకి బెంతు ఒరియాలను ఎస్టీ జాబితా చేర్చే ప్రభుత్వ నిర్ణయం ఎస్టీల పాలిట శాపంగా మార్చిందని మండిపడ్డారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఏజెన్సీలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకా అర్జున్ దొర, ఇరపా అజయ్, పూనెం వెంకట్రావు, బుద్ధుల భద్రయ్య, సవలం రాము, పర్శిక రాంబాబు, కుర్సం వెంకటేష్, సవలం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా తాము చేపట్టిన పోరాటాన్ని ఆపేది లేదని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి అన్నారు. జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సి ప్రతిపాదించిన స్కేల్స్ బయట పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎల బకాయిలు, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మీగడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మ్యుటేషన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భూముల లావాదేవీలు జరిగినప్పుడు వెబ్ ల్యాండ్‌లో ఎప్పటికప్పుడు మ్యుటేషన్ పనులు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహశీల్దారులు, రెవిన్యూ అధికారులు, విఆర్‌ఒలతో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి రెవిన్యూ శాఖ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీసేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎపిఐఐసి, ఎన్‌హెచ్ 16, రైల్వేస్ భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

వైఎస్‌ఆర్ శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వే పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న హౌసింగ్ కాలనీ ల్యాండ్ పూలింగ్ సమయంలో ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను సేకరించి అన్ని మౌలిక సదుపాయాలూ ఉండేటట్లు చూడాలన్నారు. గాజువాక హౌసింగ్‌కు సంబంధించి జీవో 301, 388పై ప్రజలకు సచివాలయాలు ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న భూ పట్టాలను ప్రజలకు వెంటనే అందించాలని అన్నారు. జిల్లాలో శాశ్వత భవనాలు లేని తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌డిఒలను కోరారు. జిల్లాలో రెవెన్యూ శాఖలో నాలుగో తరగతి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు.